**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 09.08.2024** **సమయం 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. నల్లగొండ జిల్లాలోని సుంకిశాల ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రక్షణగోడ కూలిపోయిన ప్రాంతాన్ని మంత్రుల బృందం ఈ రోజు సందర్శించనుంది.
2. సుంకిశాల పథకం రక్షణగోడ కూలిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు డిమాండ్ చేశారు.
3. తెలంగాణను ఇకపై భవిష్యత్తు రాష్ట్రం -ఫ్యూచర్ స్టేట్ అనే నినాదంతో పిలుద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.
4. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.
5. ప్రభుత్వానికి భారమైనప్పటికీ 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీని ఈ నెల 15న అర్హులందరికీ అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

----------

సుంకిశాల-మంత్రుల పర్యటన

నల్గొండ జిల్లాలో సుంకిశాల ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రక్షణగోడ కూలిపోయిన ప్రాంతాన్ని ఈరోజు మంత్రుల బృందం సందర్శించనుంది. హైదారాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు లో భాగంగా సాగర్ జలాలకు అడ్డుగా నిర్మించిన రక్షణ గోడ ఈనెల 1వ తేదీన కార్మికులు షిఫ్టు మారే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. దీనిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రమాద స్థలానికి వస్తున్నారని నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

కేటీఆర్ -సుంకిశాల

నల్లగొండ జిల్లాలోని సుంకిశాల ఎత్తిపోతల పథకం లో భాగంగా నిర్మిస్తున్న రక్షణగోడ కూలిపోయిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నీటి

అవసరాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం సుంకిశాల ప్రాజెక్టు ప్రారంభించిందని ప్రస్తుత ప్రభుత్వ నిర్వహణ లోపంతో ప్రాజెక్టు గోడ కూలిందన్నారు. ఈ సంఘటన ఈ నెల 2వ తేదీనే జరిగినా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు దాచిపెట్టిందో చెప్పాలని అన్నారు. పురపాలక శాఖకు బాధ్యత వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం తప్పు లేకుంటే ఎందుకు వారం రోజులపాటు దాచి ఉంచిందని ఆయన ప్రశ్నించారు. ప్రమాద ఘటనపై న్యాయ విచారణ జరపాలని, సంఘటన స్థలంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీనిపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

(డెస్క్)

సీఎం-అమెరికా పర్యటన

ఇకపై తెలంగాణను భవిష్యత్తు రాష్ట్రం -ఫ్యూచర్ స్టేట్ అనే నినాదంతో పిలుద్దామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కృత్రిమ మేధ హబ్, నెట్ జీరో నగరం లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో రాష్ట్రం ది ఫ్యూచర్ స్టేట్ కు పర్యాయపదంగా నిలుస్తుందని ప్రకటించారు. అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలో భారత కాన్సులేట్ జనరల్ నిర్వహించిన కృత్రిమ మేధ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో టెక్ యునికార్న్స్ సీఈఓలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం.. ఆ లక్ష్యాన్ని సూచించే నినాదం ఉందన్నారు.

(పీఎన్)

క్విట్ ఇండియా- మంత్రి పొన్నం ప్రభాకర్

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ చేరే విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈరోజు క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పతాకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ... క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకోవాలని, వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

(సిద్దిపేట జిల్లా పీటీసీ)

నల్లగొండ ప్రాజెక్టులు-సుఖేందర్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరగా పూర్తి చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. నిన్న సాయంత్రం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో కృష్ణా బేసిన్ లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి

ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని వాటిని పూర్తి చేయాలని సూచించారు. మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు మంచి పరిణామం అన్నారు.

(పీటీసీ, నల్లగొండ)

ఆదివాసి దినోత్సవం

ఈ రోజు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా గిరిజనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒక సందేశంలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్లో జరుగుతున్న ఆదివాసి దినోత్సవ వేడుకలకు గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

(పీఎన్)

నల్లమల- ఆదివాసి దినోత్సవం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ రోజు నాగర్ కర్నూల్ జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మన్ననూరులోని ఐటీడీఏ కళ్యాణ మండపంలో ఈరోజు ఆదివాసి ఉద్యోగులను, విశ్రాంత ఆదివాసి ఉద్యోగులకు సత్కారం, భారీ ర్యాలీ, సదస్సు నిర్వహిస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు.

(పీటీసీ, నాగర్ కర్నూల్ జిల్లా)

జగిత్యాల-గురుకుల విద్యార్థి మృతి

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన అనిరుద్ అనే విద్యార్థి మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడి మృత దేహాన్ని పరిశీలించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాఠశాలలో ఇటువంటి సంఘటనలు రెండుసార్లు జరిగాయని, ఇది బాధాకరమన్నారు. దీనిపై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డికి వినతి పత్రం అందించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

(పీటీసీ, జగిత్యాల)

భట్టి-రుణమాఫీ

అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తూ రైతును రాజును చేస్తామన్న తమ ప్రభుత్వ హామీ మేరకు సుమారు 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి భారమైనప్పటికీ 2లక్షల రూపాయల రైతు రుణమాఫీని ఈ నెల 15న అర్హులందరికీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలో 119 కోట్ల రూపాయల విలువ చేసే పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి విక్రమార్క ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ వైరా లో ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రైతు బహిరంగ సభ యథావిధిగా నిర్వహిస్తామన్నారు. సభలో

ముఖ్యమంత్రి రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ చెక్కులను కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అదే రోజు ముఖ్యమంత్రి సీతారామ ప్రాజెక్ట్ పంపుహౌజ్ లను ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తారని తెలిపారు. అనంతరం వైరా లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభ స్థలంలో ఏర్పాట్లను పరిశీలించారు. (పీటీసీ, ఖమ్మం)

(PTC, khammam)

మెదక్-కలెక్టర్

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామం లో స్వచ్ఛదనం - పచ్చదనం వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కోరారు. ఈ నెల 5వ తేదీ నుంచి నేటి వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

(మెదక్ జిల్లా పీటీసీ)

ఆసిఫాబాద్- గుండి అంగన్వాడి

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈనెల 15న ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగే స్వాంతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆసిఫాబాద్ జిల్లాలోని గుండి అంగన్వాడీ కేంద్రానికి ఆహ్వానం లభించిందని జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ తెలిపారు. అంగన్వాడి కేంద్ర నిర్వాహకులు విజయలక్ష్మి ఈ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అభినందించారు.

(ఆసిఫాబాద్ పిటిసి)

ఆసిఫాబాద్- పెద్దపులి

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని అంకుసాపూర్ లో పెద్ద పులి సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బుధవారం ఎర్రగుట్ట వద్ద ఒక ఆవును చంపడంతో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ అటవీ అధికారులతగ అప్రమత్తం చేశారు. పులి జాడ కోసం సిబ్బంది వెతుకున్నారు. నిన్న రాత్రి పెద్ద పులి అడ ప్రాజెక్టు వైపు వచ్చిందని తెలియడంతో సిబ్బంది ఆ ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేశారు.

(ఆసిఫాబాద్. పిటిసి)

సిరిసిల్ల-ఆది శ్రీనివాస్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ , వేములవాడ శాసనసభ్యులు శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం వివిధ అభివృద్ధి పనులకు ఈ రోజు అధికారులతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలుచేశారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల)

కరీంనగర్-కలెక్టర్

కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించే ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

(పీటీసీ, కరీంనగర్)

వేములవాడ-నాగుల పంచమి

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఈ రోజు నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి, సాయిబాబా ఆలయం వద్ద గల పాముల పుట్టలో, నాగదేవత విగ్రహాలకు భక్తులు పాలు పోశారు.

(పీటీసీ, సిరిసిల్ల)